క్లుప్తంగా

కళా తపస్వి విశ్వనాథ్‌కు నివాళి

ఏలూరు (టూటౌన్): టాలీవుడ్ దర్శక దిగ్గజం, కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతికి ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ నివాళులర్పించారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు సినీ పరిశ్రమ గొప్ప దర్శకుడ్ని కోల్పోయిందన్నారు. ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే పలు అవార్డులు అందుకున్న గొప్ప దర్శకుడని కొనియాడారు. కార్యక్రమంలో పొలిమేర కిరణ్, పి.దినేష్, జి.నాగేశ్వరరావు, జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 2.35 లక్షలు



శ్రీవారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పడమరవీధి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారి హుండీ ఆదాయం లెక్కించారు. ఏడు నెలల 10 రోజులకు రూ.2,35,723 ఆదాయం వచ్చింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆంధ్ర రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లెక్కింపులో అర్చకులు రత్నాకరం శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాళ్లపల్లి లక్ష్మీ పద్మావతి, ట్రస్టీలు మధ్యాహ్నపు సుబ్రహ్మణ్యం, పటగర్ల గీతావాణి తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలకు కాలినడకన భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రానికి శుక్రవారం పాదయాత్ర భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన శనివారం చినవెంకన్నను దర్శించేందుకు రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు, పాలకొల్లు, నిడమర్రు, కృష్ణా జిల్లాతో పాటు ఏలూరు, ఖమ్మం, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాలకు విచ్చేశారు. వీరికి కొండపైన వకుళమాత నిత్యాన్నదాన భవనంలో స్వామివారి ఉచిత అన్నప్రసాదం అందించారు. వసతి సౌకర్యాం కల్పించారు. శనివారం ఉదయం శ్రీవారి ఉచిత దర్శనం కల్పిస్తామని ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

కేంద్రం దిష్టిబొమ్మ దహనం

కుక్కునూరు: కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కుక్కునూరులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితుల ప్రయోజనాలు కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల అధ్యక్షుడు మైసాక్షి వెంకటాచారి, నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం



ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దాసరి వరలక్ష్మి



ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసిన అమీనా అన్సారీ

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. హేలాపురి మహిళా సమాఖ్య వన్‌టౌన్, టూటౌన్ అధ్యక్షులు దాసరి వరలక్ష్మి, షేక్ అమీనా అన్సారీ, కమిటీ సభ్యులు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారికి నాని శుభాకాంక్షలు తెలిపారు. పథకాలు మహిళలకు మరింత చేరువ చేస్తూ స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. సంక్షేమ ఫలాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సీఎం వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు సున్నావడ్డీ, రుణమాఫీని దశలవారీగా అందిస్తున్నారని చెప్పారు. ఆసరా, చేయూత వంటి పథకాలతోనూ ఆదుకుంటున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక పురోభివృద్ధికి తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ సమాఖ్య నూతన కమిటీ సభ్యులు పంతంగి సుబ్బలక్ష్మి, పమ్మి ఎలిజబెత్, రజనీకుమారి, పలివెల కుమారి, సరిత, సీతాల కనకదుర్గ, యాస్మిన్‌బేగం, గొంతెన సూర్యకుమారి, ఏనుగు లక్ష్మీకుమారి, ఏలూరు కార్పొరేషన్ ప్రాజెక్టు అధికారి కృష్ణమూర్తి ఉన్నారు.

బాలోత్సవాలకు సర్వం సిద్ధం

ఎమ్మెల్సీ షేక్ సాబ్జి



బాలోత్సవాల నిర్వహణకు ముస్తాబైన వేదిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హేలాపురి బాలోత్సవాలు, మూడో పిల్లల సంబరాలు ఏలూరు సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఈ నెల 4, 5 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ షేక్ సాబ్జి తెలిపారు. ఈ మేరకు స్థానిక సీఆరార్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాట్లను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. రెండు రోజులపాటు 21 అకడమిక్ అంశాలు, ఎనిమిది సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, 175 విద్యాలయాల నుంచి సుమారు 7000 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని చెప్పారు. 500 మంది నిర్వాహకులుగా, కోఆర్డినేటర్స్, న్యాయ నిర్ణతలుగా సహకారం అందించనున్నారని తెలిపారు. చిన్నారులలో మానసిక ఆనందం కలిగించడం, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడం, వారిలో పోటీతత్వం పెంచడం ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశమని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, కోశాధికారి కృష్ణారావు తెలిపారు. ముస్తఫా ఆలీ, నాట్యాచార్య డి. హేమసుందర్ నిర్వహణలో అకడమిక్, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని, భోజనాలు, నిర్వహణ బాధ్యతల్లో జె.సత్యనారాయణ రాజు, బొల్లా సత్యనారాయణ, మేతర అజయ్ బాబు, కట్టా సత్యనారాయణ, వేమా హరినారాయణ, కూచిపూడి సత్యనారాయణ, ఆడుసుమిల్లి నిర్మల తదితరులు పంచుకుంటున్నారని తెలిపారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్ష



హెల్మెట్ ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రశేఖర్, చిత్రంలో ఎస్సై ప్రసాద్

ఏలూరు టౌన్: హెల్మెట్ ధరించడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగినా ప్రాణరక్షణకు అవకాశం ఉంటుందని ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ అన్నారు. ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు ఆదేశాల మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. టూటౌన్ ప్రాంతాల్లో హెల్మెట్ డ్రైవ్ చేపట్టి, వాహనదారులకు హెల్మెట్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కొందరు వాహనదారులతో అప్పటికప్పుడే హెల్మెట్‌లను కొనుగోలు చేయించి, సురక్షితంగా ఇంటికెళ్లాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో యువత అత్యధిక శాతం మృత్యువాత పడడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఏలూరు నగరంలో ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

పిల్లలకు వాహనాలు ఇవ్వకండి

పిల్లలకు మోటారు సైకిళ్లు ఇవ్వవద్దని, చిన్నతనంలో వాహనాలను అధిక స్పీడుతో నడుపుతూ ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వన్‌టౌన్ ఎస్సై రామకృష్ణ అన్నారు. సీఐ బోణం ఆదిప్రసాద్ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురు వాహనదారులతో హెల్మెట్లు కొనుగోలు చేయించారు.

కలెక్టర్‌ను కలిసిన కార్పొరేషన్ కమిషనర్



కలెక్టర్ వెంకటేష్‌ను కలిసిన నగరపాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణ

ఏలూరు (మెట్రో): ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఎస్.వెంకట కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర మెప్మాలో స్టేట్ మిషన్ మేనేజర్‌గా పనిచేస్తూ ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు పూలమొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో పారిశుధ్య పరిస్థితులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏలూరు కెనాల్ గట్లు పరిశుభ్రత, సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

బస్సు డ్రైవర్లపై కేసు

ఏలూరు టౌన్: ఏపీఎస్ ఆర్టీసీ హెడ్‌కానిస్టేబుల్‌పై హైయర్ బస్సు డ్రైవర్లు ఇద్దరు దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు బస్టాండ్ వద్ద శుక్రవారం విధులు నిర్వర్తిస్తుండగా ఆర్టీసీ హెడ్‌కానిస్టేబుల్ టి.శ్రీనివాసరావుతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు హనుమాన్‌నగర్‌కు చెందిన బురదగుంట ప్రకాష్, పోస్టల్ కాలనీకి చెందిన పాలబూతి మధు గొడవపడ్డారు. అతని విధులకు ఆటంకం కలిగించటమే కాకుండా దాడికి పాల్పడ్డారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు డ్రైవర్లపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఏలూరు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

5న యాదవ యువ సమ్మేళనం



వాల్‌పోస్టర్ విడుదల చేసిన నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): ద్వారకాతిరుమలలోని శ్రీ కృష్ణ యాదవ కల్యాణ మండపంలో ఈ నెల 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఏలూరు జిల్లా యాదవ యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాట్రు బాలు తెలిపారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం యాదవ యువ సమ్మేళనం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లాలోని యాదవ యువతను ఒక వేదికపైకి తీసుకు రావడం ద్వారా వారిలో ఐకమత్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని బాలు చెప్పారు. యాదవ యువత విద్య, ఉపాధి, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఒక బలమైన శక్తిగా ఎదగాలన్నదే తమ ఆకాంక్షగా పేర్కొన్నారు. జిల్లాలోని యాదవ యువత అంతా పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ ప్రసాద్ యాదవ్,శేషు యాదవ్, పానకాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫలితాల ఆధారిత విద్యాబోధనకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రమణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంజినీరింగ్ విద్యలో ఫలితాల ఆధారిత విద్యాబోధనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ నిట్ డైరెక్టర్, ప్రొఫెసర్ రమణ సూచించారు. స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఫలితాల ఆధారిత విద్య అనే అంశంపై నిట్ వరంగల్ అనుబంధంతో ఐదు రోజులు పాటు నిర్వహించే వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమంలో ప్రధానవక్తగా రమణ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యాబోధనలో మారుతున్న కాలానికి అనుగుణంగా పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. పాఠ్యాంశాలను, అనువర్తనలను ఉదాహరణలతో బోధించాలని అధ్యాకులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మురళీధరరావు మాట్లాడారు. వర్క్‌షాపు కన్వీనర్ డాక్టర్ ప్రసూన, కోకన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ అసిస్టెంట్ మేనేజర్‌పై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని పి.కన్నాపురం సర్వారాయ షుగర్స్ లిమిటెడ్ బాటిలింగ్ యూనిట్ (కోకోకోలా ఫ్యాక్టరీ) అసిస్టెంట్ మేనేజర్ (లాజిస్టిక్స్) పద్మనాభుని శివకుమార్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని తనతోటి ఉద్యోగి నరాల శ్రీనివాసుతో కలిసి శివకుమార్ బైక్‌పై భీమడోలులోని తన ఇంటికి వెళుతున్నాడు. స్థానిక వీరాంజనేయ హోటల్ వద్దకు వచ్చేసరికి మాస్కులు, హెల్మెట్‌లు ధరించి ఉన్న గుర్తుతెలియని ఇద్దరు బైక్‌ను అడ్డగించి, శివకుమార్‌పై రాడ్డుతో దాడి చేశారు. శ్రీనివాసు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా బైక్‌పై పరారయ్యారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

8న భూమి కోసం జిల్లా సదస్సు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): భూమికోసం ఈ నెల 8న జిల్లా సదస్సును టి.నర్సాపురంలో నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి తెలిపారు. భూమికోసం కరపత్రాన్ని స్థానిక అన్నేభవన్‌లో రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పాత చింతలపూడి తాలూకాలో సుమారు 30 వేల ఎకరాలు, జిల్లాలో మొత్తం 60 వేల ఎకరాలు అసైన్డ్ భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయన్నారు. జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మధ్యలో ఉన్న ఎర్రకాలువ ఇరిగేషన్ మిగులు భూములను పేదలకు పంచాలని ఆరేళ్లుగా పోరాడుతున్నట్టు చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల భూములను స్థానికేతర భూస్వాములు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, నాయకులు ఆనందరావు, సీహెచ్ జాన్‌రాజు, కె.వినోద్, డి.నాగేంద్ర పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	18	ములక్కాడలు	15
బెండకాయలు	52	కంద	40
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	34
కాకర కాయలు	30-34	కీరా దోస	44
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	50
బీరకాయలు (పందిరి)	60	అల్లం	68
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	30	పాలకూర	08
దొండకాయలు	28	చుక్కకూర	08
బంగాళదుంపలు	25	తోటకూర	08
ఉల్లిపాయలు	24	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	07
దోసకాయలు	28-34	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	25
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	25
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	08
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	09
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	18
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

రేపటి నుంచి రామకోటి మహోత్సవాలు



మహోత్సవాల బుక్‌లెట్‌ను విడుదల చేసిన ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో 91వ రామకోటి మహోత్సవాలను ఈనెల 5 నుంచి 26 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని స్థానిక రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ తెలిపారు. స్థానిక అగ్రహారం పేరయ్య కోనేరు ప్రాంగణంలోని కోదండ రామాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 5, 6 తేదీల్లో గురుమహిమ అనే అంశంపై వద్దిపర్తి పద్మాకర్ ఉపన్యాసం, 6న సాయంత్రం సౌందర్యలహరి దీప పూజ, దీపలక్ష్మీ స్తోత్ర పారాయణ, 7న దేవీ మహత్యం పారాయణ, పంచోపచార పూజ, 11న సాయంత్రం శ్రీకృష్ణ రాయబారం - మయ సభ పడక సీను పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. 12న నోరి నారాయణ మూర్తిచే హనుమంతు వైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం, 15న రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటక ప్రదర్శన, 16న రాయామణంపై తోలుబొమ్మలాట, 17న లలితా సహస్రనామ పారాయణ, సామూహిక కుంకుమ పూజలు, 18న మహాశివ రాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, శివపార్వతుల కల్యాణం, జ్యోతిర్లింగార్చన, కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశామని తెలిపారు. 19న భారతం, రామాయణం అంశాలపై పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు, 22న సామూహిక సీతారామ కల్యాణ మహోత్సవం, 23న సీతారామ కల్యాణం అనే అంశంపై బుర్రకథ, 26న ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్న సమారాధన, కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవాల బుక్‌లెట్‌ను విడుదల చేశారు. సమావేశంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ప్రతినిధులు మానేపలిల్ల రామారావు, రవ్వా శ్రీవెంకట బలరామ కృష్ణారావు, సోమిశెట్టి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



రాఘవాపురం హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఇన్‌చార్జి డీఈఓ

చింతలపూడి: ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారి ఎంవీ అవధాని 10వ తరగతి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని రాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పలు పాఠ్యాంశాలపై ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం, నాడు, నేడు పథకంలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పీఎస్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్చి నాటికి పన్నుల వసూలు పూర్తిచేయండి

లింగపాలెం: మార్చి నెలాఖరు నాటికి ఇంటి, నీటి పన్నుల వసూలు పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకె మల్లికార్జునరావు ఆదేశించారు. గ్రామాల్లోని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతీరుపై శుక్రవారం స్థానిక లింగపాలెం మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయాల కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. పంచాయతీలు చెత్త నుంచి సంపదతయారీ ద్వారా స్వావలంబన సాధిస్తాయన్నారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో డంపింగ్‌యార్డుల్లో సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. పంచాయతీ చెరువు సాగు భూములు ఆక్రమలకు గురైతే తొలగించాలని ఆదేశించారు. అనంతరం మఠంగూడెంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను డీపీఓ పరిశీలించారు. ఈవోపీఆర్‌డీ జేఎం రత్నకుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలి

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది వ్యవసాయ శాఖ ఉద్యోగులు సమన్వయంతో విధులు నిర్వహించాలని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. శుక్రవార పోతునూరు రైతు భరోసా కేంద్రంలో ఈ క్రాప్ హాజరును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రాలకు వచ్చే రైతులకు జవాబుదారీగా సిబ్బంది సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో బోదుల శ్రీనివాసరావు, ఆర్‌బీకె సిబ్బంది ఉన్నారు.

బౌద్ధారామాలను సందర్శించిన ముంబై విద్యార్థులు

కామవరపుకోట: మహారాష్ట్రలోని ముంబై విశ్వవిద్యాలయంలో పాళీ భాష విభాగానికి చెందిన సుమారు 100 మంది విద్యార్థులు మండలంలోని గుంటుపల్లి బౌద్ధ గుహలను సందర్శించారు. బౌద్ధ ప్రదేశాల సందర్శనలో భాగంగా నాగర్జున కొండ, వట్టిప్రోలు, అమరావతి సందర్శించి గుంటుపల్లి గుహలను సందర్శించినట్లు విశ్వవిద్యాలయ సమన్వయకర్త డాక్టర్ యోజన్ భగత్ తెలిపారు. మూడేళ్లకోసారి వీటితోపాటు ఉత్తర భారత దేశంలోని కొన్ని ప్రాంతాలు, అంతర్జాతీయంగా శ్రీలంక, మయన్మార్, థాయిలాండ్ మొదలైన బౌద్ధ ప్రదేశాలనూ సందర్శిస్తామని చెప్పారు. ఈ ప్రదేశంలోని బౌద్ధరామాలు ఆకట్టుకున్నాయని తెలిపారు

సానెగూడెంలో వైఎస్సార్ పొలంబడి

దెందులూరు: వరి పంటలో వచ్చే పురుగులు, తెగుళ్ల నివారణకు వాడే మందులు మోతాదును రైతులంతా వ్యవసాయ శాఖ సిబ్బంది, సలహాల, సూచనలతో వాడాలని దెందులూరు ఏవో గద్దె రమేష్ అన్నారు. గురువారం సానెగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ విష్ణు, ఉద్యానవన సహాయకులు చింతా చాణక్య వర్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి జరిగింది.ఈ కార్యక్రమంలో రైతులు కూరంశెట్టి ధనుంజయరావు, అక్కినేని హనుమోజిరావు, సత్యనారాయణ, కూనేరావు, శ్రీనివాసరావులు సాగుకు సంబంధించి వివరాలను ఏవోను అడిగి తెలుసుకున్నారు.

చెరువు పనుల పరిశీలన

పెదవేగి : కరువు పనుల్లో కష్టపడి పనిచేసే వారికి ఎక్కువ వేతనం పొందే అవకాశం ఉందని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. శుక్రవారం ఆయన గార్లమడుగు పంచాయతీ సూర్యారావు పేట చెరువులో జరుగుతున్న కరువు పనులను పరిశీలించారు. పనిచేస్తున్న కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ వేసిన మస్టర్లను ఎంపీడీఓ క్షుణ్ణంగా పరిశీలించారు. పని ప్రదేశంలో తాగు నీరు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రథమ చికిత్సకు అవసరమయ్యే మందులను అందుబాటులో ఉంచాలని టిఏని ఫీల్డ్ అసిస్టెంట్‌ని ఆదేశించారు.

అన్ని గ్రామాల్లోనూ మొక్కలు నాటాలి

పెదపాడు : ఉపాధిహామీ పథకంలో అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలని డ్వామా పీడీ డీ రాంబాబు తెలిపారు. పెదపాడు మండలంలోని 2020-21, 2021-22 ఆర్థిక సంవ్సరాలకు సామాజిక తనిఖీ నిర్వహించారు. నిర్వహించిన పనులు, వాటి అభ్యంతరాలపై గ్రామాల వారీగా సమీక్షించారు. ఉపాధిహామీ పథకంలో 1669 పనుల్లో రూ 23కోట్లు విలువైన పనులు నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖలో 74 పనులుకు రూ3.10లక్షలు, సర్వశిక్ష అభియాన్ పథకంలో 15 పనులకు రూ.15.50 లక్షలు ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో 4 పనులకు రూ.12లక్షలు ఫారెస్టు విభాగంలో రూ.12లక్షలు విలవైన పనులు నిర్వహించామన్నారు. కొన్ని గ్రామాల్లో వేలిముద్రలు, సంతకాలు లేకుండా వారికి పేమెంట్స్ చేయడం జరిగిందన్నారు. ఇలాంటి లోపాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. పెదపాడు ఎంపీపీ బత్తుల నిర్మలకుమారి, ఎస్ఆర్‌పీ దాసు, పెదపాడు ఎంపీడీవో ఎస్‌నిర్మలజ్యోతి, బీసీ సెల్ అధ్యక్షుడ ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
99122 20559
95055 08399
96408 32693
Office mail : tpgadvt@gmail.com